# రాజకీయ మంటలు

ఆనందరావు పార్టీ ఇచ్చాడంటే ఏదో పెద్ద విశేషమే ఉంటుంది. ఆయనిచ్చే పార్టీలు జోరుగా ఉంటాయని ఆయన పార్టీలకు వెళ్ళి వచ్చినవాళ్ళు చెప్పుకుంటారు. పార్టీ రాత్రి ఏ పది గంటలకో మొదలై అర్ధరాత్రికి ఊపందుకుంటుందంటారు. ఈరోజుపార్టీ ఎప్పటిలా పెద్దది కాదు. చాలా చిన్నది.

ఈ పార్టీకి ఇప్పటి ఎం.ఎల్.ఏ. జగన్నాథం, జిల్లా పరిషత్తు అధ్యక్షుడు కిషన్‌రావు, భూమి రిజిస్ట్రేషన్ ఆఫీసులో పనిచేసే రిజిస్ట్రార్ మోహన్‌రావు, డిప్యూటి కలెక్టర్ వెంకట్రావు వచ్చారు. చికెన్ పులావ్, మటన్ పులావ్, చికెన్ సిక్స్టీఫైవ్, మటన్ కుర్మా, ఫిష్‌ఫ్రై, జింజర్ రొయ్యలు డిష్‌లో పెట్టి ఉన్నాయి. వాళ్ళ ముందున్న ప్లేట్లలోని వంటకాల నెవరూ తాకడం లేదు. కానీ శివాస్ రీగల్, రాయల్ సెల్యూట్, పీటర్ స్కాట్ విస్కీసీసాలు మాత్రం తొందర తొందరగా ఖాళీ అవుతున్నాయి. గదిలో ఓమూల ఖాళీ విస్కీసీసాలు దొర్లుతున్నాయి.

"మన విస్కీ ఇట్ల ఉండదండి. ఎంతయిన తెల్లోడి సర్కే సరుకు" అన్నాడు ఎం.ఎల్.ఏ. జగన్నాథం. మామూలుగా జగన్నాథం ఎక్కువగా మాట్లాడడు. కానీ కాళికాదేవి నాలుక మీద గీత గీసినంతనే కాళిదాసు కవిత్వం చెప్పినట్లుగా జగన్నాథం రెండు పెగ్గులు తాగాక మాట్లాడ్డం మొదలుపెడ్తాడు.

"హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో పనిచేస్తున్న కస్టమ్స్ ఆఫీసర్ పవన్‌కుమార్ దీక్షిత్ ఇచ్చిన సరుకు ఇది. బాగుండక ఏం జేస్తది" నవ్వాడు ఆనందరావు.

"అంటే అచ్చమైన ఫారెన్ సరుకన్నమాట" అన్నాడు జగన్నాథం నిశ్శబ్దంగా నవ్వుతూ. అతడు నవ్వితే ఎప్పుడూ శబ్దం రాదు. పెదవులు మాత్రం పూర్తిగా సాగి అటువైపు ఇటువైపు చెవుల నంటుకుంటాయా అన్నట్లుగా వుంటాయి. అతని కారునలుపు ముఖం మీద తెల్లని పళ్ళు, గులాబిరంగులో చిగుళ్ళు ఆరోగ్యంగా కనిపిస్తాయి. ఆ నవ్వు అతని ముఖం మీద ఎప్పుడంటే అప్పుడు ప్రత్యక్షమౌతుంది.

డిప్యూటీ కలెక్టర్ వెంకట్రావుకు అప్పుడప్పుడు వెక్కిళ్ళు వస్తున్నాయి. అట్లా వచ్చినప్పుడల్లా చేతిలోని గ్లాసు ఎత్తి విస్కీ నోట్లో పోసుకుంటున్నాడు. అతని కళ్ళు మూసుకుపోతున్నాయి.

"కలెక్టర్ వస్తాడంటిరి ఏడి? రాకపాయె" అని అడిగాడు వెంకట్రావు.

కలెక్టర్ రాకుండా ఉంటేనే బాగుంటుందని అతని మనసులో ఉన్నప్పటికీ మాట వరసకు అడిగాడు.

"వస్తానన్నాడు రాలేదు గద" కొంచెం నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు ఆనందరావు.

'ఆనందరావు కలెక్టర్ని పిలిస్తే రాకుండా ఉంటాడా?' అని జిల్లా పరిషత్ అధ్యక్షుడు కిషన్‌రావు మనసులో అనుకుని పైకి మాత్రం "కలెక్టరంటె లక్ష పనులు, ఎక్కడ తీరుతది' ? అన్నాడు. అప్పటికే అతని మాట తడబడుతున్నది.

"మంత్రి అంతటి ఆనందరావు పిలిచారు మనం వచ్చి వాలాం. అంతే" అన్నాడు జగన్నాథం.

"ఆనందరావు ఇప్పుడు ఎం.ఎల్.ఎ. కాకపోతే ఏంది ? ఆయన ఎమ్మెల్యేకన్నా ఎక్కువే!" అన్నాడు మోహన్‌రావు. అతను ఎన్ని పెగ్గులు తాగినా తూలడు. మాట తడబడదు. కిషన్‌రావయితే రెండు పెగ్గులు తాగాడంటే అతనేం చేస్తున్నాడో అతనికే తెలియదు.

"ఎమ్మెల్యే కాకపోతే ఏందయ్యా, ఆయనిష్టముంటే ఇప్పుడంటే ఇప్పుడు మినిష్టరైతడు. ఎమ్మెల్యేగా ఉండి బదనాం ఎందుగ్గావాలని జగన్నాథంను నిలబెట్టిండు" కిషన్‌రావు గతాన్ని గుర్తు చేశాడు.

జగన్నాథం నిజమే అన్నట్లుగా నవ్వుతూ వినయంగా తలవంచుకున్నాడు. "నా చర్మం వొలిచి చెప్పులు కుట్టిచ్చినా దొరవారి రుణం తీరదు" అన్నాడు.

అంతకుముందు వరుసగా రెండుసార్లు ఆనందరావు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాడు. గత ఎన్నికల్లో తను నిలబడనని, బలహీనవర్గాల నుంచి ఎవరైన నిలబడితే పూర్తి మద్దతు నిస్తానని ప్రకటించి అలాగే చేశాడు. జగన్నాథం గెలిచాడు.

ఆనందరావు చేసింది గొప్ప త్యాగమన్నారు. బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడే నాయకుడిగా గొప్ప కీర్తిని తెచ్చుకున్నాడు. గతంలో ఆయన పై వచ్చిన అవినీతి ఆరోపణలు ఈ త్యాగంతో తుడిచి పెట్టుకుపోయాయి. ప్రజల్లో నిస్వార్థపరుడన్న పేరు బలపడసాగింది. ఇది ఇలా ఉంటే తాను ఎమ్మెల్యేగా ఉండటం కంటే తన చెప్పుచేతల్లో ఉన్నవాడిని ఎమ్మెల్యేగా చేయడం తనకెంతో లాభదాయకంగా ఉందని ఆనందరావు ఎప్పుడో నిర్ణయించుకున్నాడు.

"ఈసారి మీ తోటలో మామిడిపండ్లు బాగా కాసినయంట. ఒక్క పండయినా మాదాక రాలేదని మా ఆవిడ అన్నది" సంభాషణను మార్చుతూ అన్నాడు వెంకట్రావు. అతని కళ్ళు మత్తుతో మూసుకుపోతున్నాయి.

అందరికీ పండ్లు పంపిన, మీకందలేదా ఏంది?" చిరునవ్వుతో అడిగాడు ఆనందరావు.

తిరిగి తనే "ఈసారి పండ్లు దుబాయికి ఎక్కువ ఎగుమతి చేసినం. అందుకే నా కొడుకు అమెరికా నుంచి మామిడిపండ్ల తోట ఇంకోటి పెట్టుమని రాసిండు. పండ్లతోటల

మీదయితే పన్నులుండయి, బాగా ఎగుమతి జేసుకోవచ్చు. అదే బాగుంటదనిపిస్తుంది నాగ్గాద...'' అన్నాడు.

''మరి ఆలస్యమెందుకు, ఇంకో తోట పెట్టరాదుండ్రి'' అన్నాడు జగన్నాథం పళ్ళన్నీ బయటపెట్టి.

''అందుకే గద మిమ్మల్నందర్ని పిల్చింది'' నవ్వాడు ఆనందరావు గంభీరంగా.

''అదే ఏదో ఉన్నదనే అనుకుంటున్న. మీకు లాభమైతే మాకింత దొరుకుతది'' అన్నాడు వెంకట్రావు. కళ్ళు మూతలు పడుతున్నా బుర్ర మాత్రం బాగానే పనిచేస్తోంది.

ఆనందరావు సర్దుకుని కూర్చుంటూ గంభీరంగా ''మల్ల ఎలక్షన్లు వస్తునయ్. మన జగన్నాథం మల్ల గెలువాలంటే పేదోల్లకు ఏదైన గట్టి పని చేసిపెట్టాలె. లేకపోతే ఎట్ల గెలుస్తడు? గిన్ని రోజులు ఏ పని చేయకుంట గడిపిండు. ఇప్పుడైనా సి.ఎం.ను పిలిపిచ్చి పెద్ద ప్రోగ్రామ్ జెయ్యాలె'' అన్నాడు జగన్నాథం భుజం మీద చెయ్యేసి తడుతూ ఏమంటావ్ అన్నట్లుగా చూశాడు.

జగన్నాథం ఆ స్పర్శకు పులకించిపోయాడు. ''దొర నాలాంటి వాడి భుజం మీద చెయ్యేసి మాట్లాడిండంటే ఎంత గొప్ప? ప్రజాస్వామ్యంలో ఇది సాధ్యమయింది. వేరే దినాలల్ల ఇది సాధ్యమా?'' అనుకున్నాడు.

''అసలు ఇంతకూ మీ ప్లానేమిటో చెప్పలేదు'' అనడిగాడు కిషన్‌రావు.

''మన ఊరి శివార్ల యాభయ్యో, నూరో ఎకరాల బంజరు భూమి ఉంది-'' అని ఆగాడు ఆనందరావు.

''అవి బంజరు భూములు కావు సార్ ! అప్పుడెప్పుడో దేశమిడిచిపెట్టి పాకిస్తాన్‌కు పోయినోళ్ళ పట్టాభూములు. యాభై ఏం ఖర్మ వంద ఎకరాలకు మించే ఉంది'' అన్నాడు మోహన్‌రావు. ఎక్కడ ఏ భూమి ఉందో అతని కంప్యూటర్ బుర్రలో అన్ని రికార్డయి ఉన్నయి.

''గదే అనుకో - ఆ భూమి మాదనేటోళ్ళు ఎవ్వరు ఇక్కడలేరు. అందరు పాకిస్తాన్ పోయిండ్రు. అప్పట్నుంచి అక్కడ గొల్లోళ్ళు గొర్రెలను, మేకలను మేపుకుంటున్నరు. గా భూము లను కూలినాలి చేసుకునే పేదోళ్ళకు, హరిజనులకు సి.ఎం. చేతుల మీదినుంచి పట్టా ఇప్పిద్దాం. అన్ని సంగతులు చూసుకునేందుకు మన మోహనరావు ఉండనే ఉన్నాడు గదా?...'' నవ్వుతూ అన్నాడు ఆనందరావు జగన్నాథం భుజం చరుస్తూ.

''దీంతో ఈసారి కూడా మన పార్టీ తరఫున జగన్నాథం గెలుపు ఖాయం'' అన్నాడు మళ్ళీ ఆనందరావే.

''గా భూములు వాళ్ళ కిచ్చేదెందుకు మీరింత మేమింత పట్టా చేయించు కుంటే పోదా?'' అనడిగాడు కిషన్‌రావు.

''అంత తొందర పనికిరాదయ్య. జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా ఉన్నవ్ గాని ఏ పని ఎట్ల జెయ్యాల్నో పనిరోకు తెల్వకపోతే ఎట్ల?'' అన్నాడు ఆనందరావు.

"ఆ పేదోళ్ళకు ఎన్ని స్కీములు పెట్టినా ఎన్ని రిజర్వేషన్లు చేసినా అట్లనే ఉంటరు. ఎక్కడున్నరో అక్కడే ఉంటరు" అన్నాడు వెంకట్రావు.

"అట్లా అంటే ఎట్లనయ్యా, జిల్లాకు కలెక్టర్ తరువాత కలెక్టరంతటి వాడివి, వాళ్ళ అభివృద్ధికి ఏవో పనులు చేపట్టాలే, ఆ తరువాత వాళ్ళని ఎక్కడుంచాలో అక్కడే ఉంచాలె. అది మాలాంటి రాజకీయ నాయకులకే తెలుస్తది" మరోసారి గట్టిగా నవ్వుతూ అన్నాడు ఆనందరావు.

"ఆ భూమిని ఆ పేదోళ్ళు ఏం చేసుకుంటరండి, వాళ్ళ దగ్గరేముంది? పెట్టుబడిపెట్టి వ్యవసాయం చేస్తరా? కూలినాలి చేసుకుని తాగి తినేటోళ్ళు ఆ భూమిని దున్ని సాగు జేస్తరా?" అని కిషన్‌రావు తడబడుతూనే అడిగాడు. తనకేం తెలియదన్నట్లుగా ఆనందరావు మాట్లాడినందుకు కోపం కూడా వచ్చింది.

"మరి అక్కడే ఉన్నది కిటుకు" అని పకపక నవ్వాడు ఆనందరావు.

"ఆ భూమిని ఏం చేసుకోవాలో తెలియదు వాళ్ళకు. అప్పుడు మన దగ్గరికి ఉర్కొ స్తరు" అన్నాడు ఆనందరావు.

"వస్తే...?"

"నువ్వు నేర్చుకోవలసింది చానా ఉంది. నాకు తెలుసు నీవు ఎన్నడో ఒకనాడు ఎం.ఎల్.ఏ. కావాలని కలలు కంటున్నవ్" అని నవ్వాడు ఆనందరావు.

జగన్నాథం నవ్వుతూ అందరి వైపు చూస్తున్నాడు.

"ఆ భూమి ప్రభుత్వం దళితులకు పంచిపెడుతున్నదని ప్రచారం అయితది. పేపర్లకెక్కు తది. టీవీల్లో చూపిస్తారు. ఎన్కట వినోభాబావేకు భూస్వాములు భూములియ్యలేదా? ఆ భూములన్ని ఎవరి దగ్గరున్నయి నీకు తెల్వదా కిషన్‌రావు!" అని అడిగాడు ఆనందరావు. అతడే మళ్ళీ -

"ఎలక్షన్లు అయిందనుక ఆ భూమి దళితులదే. ఆ తర్వాత మనది" ఆనందంగా గర్వంగా నవ్వాడు ఆనందరావు.

"దాంతోటి మాకేం ఒరుగుతది" ఇక ఉండబట్టలేక అడిగేశాడు వెంకట్రావు. అందరిలో అదే ప్రశ్న తొలుస్తున్నది.

"లాభం అందరికీ పంచకుంట నేను ఒక్కడినే అనుభవిస్తనా? కడుపులు కొట్టెటోన్ని కాను నేను. ఎప్పుడైన అట్ల చేసిన్నా నేను. లివ్ లెట్ అదర్ లివ్ పాలసీ నాది. మొత్తం నూరెకరాల భూమిల తోట లేస్తది. అమెరికాలో ఉన్న నా కొడుకు కోరిక తీర్చాలని ఉన్నది నాకు. వాడో అమయాకుడు. అంత దూరంల ఉన్నా వానికి దేశం మీదనే ప్రాణం గుంజు తుంటది. దేశానికి పేద ప్రజలకు ఏమన్న చెయ్యాలని ఆరాటపడుతుంటడు" ఆనందరావు గొంతు ఆర్ద్రంగా మారింది కొడుకు గుర్తుకు వచ్చేసరికి.

వెంటనే తన ఊరు సంగిగూడెంలో బహిరంగసభ ఏర్పాట్లు చేశాడు ఆనందరావు. సి.ఎం.ను పిల్చాడు. లారీల్లో ప్రజలను సభకు చేరవేసే ఏర్పాట్లు కిషన్‌రావుకు, జగన్నాథంకు

అప్పజెప్పాడు. ఒక్కొక్క లారీ ఇంతమందిని చేరవేస్తే ఇంత డబ్బు అని లారీ ఓనర్లతో మాట్లాడుకొన్నారు వాళ్ళు. ప్రజలు వేల సంఖ్యలో వచ్చారు. పెద్ద సభ! భూమి పట్టాలను తీసుకునే హరిజనులను వేదిక పక్కగా కూర్చోబెట్టారు.

"గీల్లను తెచ్చి ముందల కూసుండబెట్టింగ్రు" అని సభకు వచ్చిన జనం హరిజనులను చూసి విసుక్కున్నారు.

"ఒరే! గట్ల తగులుకుంట కూసునే బదులు దూరంగా కూసోరాదుంగ్రి. భూములు రాంగనే భూస్వాములమైపోతున్నమని అప్పుడే కావరం కొడుకులకు" అన్నాడో కార్యకర్త.

"అంతే! వాళ్ళ తీరే అంత. జెరంత దగ్గరికి రానిచ్చినమంటె నెత్తికెక్కి కూసుంటరు. వాళ్ళుండే సోటు అక్కడ దూరంగా అని మర్చిపోతరు" విసుక్కున్నాడు మరో కార్యకర్త.

అందంగా అలంకరించిన పెద్ద వేదిక మీద సి.ఎం.తో పాటు జగన్నాథం, ఆనందరావు, కిషన్‌రావులు కూర్చున్నారు. జగన్నాథం ఒక్కొక్క పట్టా కాగితాన్ని అందిస్తుంటే సి.ఎం. హరిజనులకు పంచి పెట్టాడు. ఆ కాగితాలను హరిజనులు చేతుల్లో పట్టుకొని సంబరపడిపోయారు.

ఆ తర్వాత ఎలక్షన్లు వచ్చాయి. అనుకున్నట్లుగానే జగన్నాథం మళ్ళీ ఎం.ఎల్.ఏ.గా గెల్చాడు. ఎలక్షన్ల ఫలితాలు తెలిసిన మర్నాడే ఆనందరావు హరిజనులను తన ఇంటికి పిలిపించాడు. అక్కడ జగన్నాథం, కిషన్‌రావు, మోహన్‌రావులు వున్నారు. వాళ్ళందరూ కుర్చీల్లో కూర్చొన్నారు. ఆనందరావు వాళ్ళవైపు నవ్వుతూ చూశాడు. ఎక్కువ ఆలస్యం చేయకుండా విషయంలోకి దిగాడు.

వచ్చిన హరిజనులంతా భూమ్మీద దూరంగా కూర్చున్నారు. ఆడ, మగా, యువకులు, వృద్ధులూ అందరూ వున్నారు. ఆ గుంపులో వృద్ధుడు పెంటయ్య. అతని పక్కన కొంత దూరంలో శ్రీరాములు కూర్చున్నాడు. శ్రీరాముల్ని చూసి "వీడు పట్నం నుంచి ఎప్పుడొచ్చాడు? నిప్పురవ్వ లెక్క గిప్పుడు వీడేం జేస్తడో, ఏందో? వీడేమైన పుల్లబెడ్తే వ్యవహారమంత బెడిసికొడ్తది!" అని భయపడ్డాడు ఆనందరావు మనస్సులో.

శ్రీరాములు యువకుడు. హైద్రాబాదులో కొన్నాళ్ళు కూలిపనులు చేసాడు. అక్కడే లోకం పోకడను, జరుగుతున్న అన్యాయాలను అర్థం చేసుకున్నాడు. అమ్మయినా అడగంది బువ్వ పెట్టదు. గట్లనె మనం ఎదిరించి అడగంది పోరాడంది తమ బతుకులు గిట్లనే వుంటయి - అనే తత్వాన్ని గ్రహించాడు. దాంతో ధైర్యం ఏర్పడింది అతనిలో.

"ప్రభుత్వం మీకు భూములిచ్చింది. ఆ భూములను మీరేం చేసుకుంటరు. వాళ్ళకు ఇండ్లు కట్టించి ఇస్తే బాగుంటదని నేను సి.ఎం.కు చెప్పిన. ఆయన దానికి వెంటనే ఒప్పుకున్నాడు. మీకు తలా ఒక ఇల్లు, పక్కా ఇల్లు కట్టిచ్చేటందుకు సి.ఎం. అనుమతిచ్చిండు. తొందరగానే పని ఊరి బయట మొదలైతది" అన్నాడు ఆనందరావు. అతని గొంతు మార్దవంగా ఉంది. అతని మాటలకు అందరి ముఖాలు సంతోషంతో వెలిగిపోయాయి.

హరిజనుల్లో కాస్త ధైర్యంగా మాట్లాడగలిగిన వ్యక్తి పెంటయ్య. అందరూ వయస్సులో పెద్దవాడైన పెంటయ్యవైపు 'నువ్వు మాట్లాడు' అన్నట్టు చూశారు.

"మీరన్నట్లనే మేం గా భూములేం జేసుకుంటం దొర!" అన్నాడు పెంటయ్య. అతడు ఓ మాసిపోయిన గుడ్డపేగును ధోవతిగా మొలకు చుట్టుకున్నాడు. మరో మాసి పోయిన గుడ్డపేగు ఉత్తరీయంగా భుజం మీద వేసుకున్నాడు. అతని తలకు నూనె తగలక ఎన్ని రోజులయిందో, మాసిపోయిన తెల్లని నైలాన్ పోగుల్లాగా ఉన్నాయి వెంట్రుకలు. పెంటయ్య అలా అనగానే-

"దొరా! గా భూములేం జేసుకుంటం?" అన్నారందరూ ఏక కంఠంతో.

"గా ఇండ్లు కట్టిచ్చి ఇస్తే బాగుంటది. నెత్తి మీద గింత నీడ అన్నా ఉంటది. మీ పేరు చెప్పుకొని బతుకుతం దొరా!" అంది పెంటయ్య భార్య లచ్చమ్మ. ఆమె కళ్ళు గుంతల్లోకిపోయాయి. ఒంటిమీద మాంసమన్న మాటలేదు.

"ఇది జెప్పేటందుకే పిలిచిండ్రు దొర మిమ్ములిని" అన్నాడు కిషన్‌రావు మధ్యలో కల్పించుకొని.

"మీకు ఇండ్లు తొందరగానే కట్టిస్తం. గిప్పుడు మీకు తలా రెండు వేలు ఇస్త. ఈ కాగితం మీద గా భూములు మాకు వద్దని సంతకాలు - అదే వేలిముద్రలు వేయించ్రి" అన్నాడు ఆనందరావు. నిజానికి ఆనందరావు మోహన్‌రావుతో కలిసి ఆ భూములను తనకి అమ్మినట్లుగా కాగితాలు తయారు చేయించాడు. ఆ కాగితాలే అవి. వేలి ముద్ర వేయడానికి పెంటయ్య లేచాడు. భుజం మీది గుడ్డను సంకలో ఇరికించుకుని ముందుకు కదిలాడు. ఇంతలో శ్రీరాములు గుంపులోంచి లేచి నిల్చున్నాడు.

"ఒద్దు వేలిముద్ర ఎయ్యకు పెద్దయ్య" అని అరిచాడు ఆవేశంగా.

అనుకున్నంతా అయింది. నిప్పు రాజేస్తడనుకుంటె రాజేస్తనే వున్నడు గీ చెకుముక రాయి.

"సర్కారోళ్ళు ఇచ్చిన భూములను వాళ్ళు కాజేద్దామని చూస్తుండ్రు. నువ్వు వేలి ముద్ర ఎయ్యకు పెద్దయ్యా" అన్నాడు ఆవేశంగా.

"గా భూమిని ఏం జేసుకుంటం మనం" అన్నాడు పెంటయ్య నిస్సహాయంగా. ఎవసాయం జేసే తాహతు మనకున్నాదిరా, చెప్పు" అనడిగింది లచ్చమ్మ, ఆవేశంతో నిలు చున్న శ్రీరాములు చేయి పట్టుకుని.

"అదికాదే పెద్దమ్మ గా భూమి మనది, మనమే ఏదో విధంగా కష్టపడి దున్ను కుందాం, పంట పండిచ్చుకుందాం" అన్నాడు శ్రీరాములు.

"ఎవసాయమంటే మాటలా? మనతోటి ఏమైతది?" గొణిగారు అక్కడున్న వాళ్ళు.

"మనం కూలి చేస్కుంటలేమా కష్టపడ్తలేమా గదే కష్టం గీ భూమ్మీద చేస్కుందాం, గీ కాయితాల మీద వేలి ముద్రలేయొద్దు..." అన్నాడు శ్రీరాములు.

అక్కడ కూర్చున్న వాళ్ళంతా ఏం మాట్లాడలేదు. నిశ్శబ్దంగా ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

"ఏహె లెవుండ్రి ఇంక కూసున్నరెందుకు, వేలిముద్రలొద్దు. ఏం వొద్దు. మనం యవసాయం చేసే చూపిద్దాం అందరికి" అని శ్రీరాములు ఆవేశంతో లచ్చమ్మ చేయి విదిలించుకుని దొర బంగ్లా గేటు బయటికి దారి తీశాడు. అందరూ అతని వెంట బయటికి నడిచారు.

ఆనందరావు కోపంతో ముఖం ఎర్రబడింది. కళ్ళల్లో నిప్పులు కురిసాయి. "వాళ్ళనెట్లా దారికి తేవాలో నాకు తెలుసు" అంటూ పళ్ళు కొరికాడు.

హరిజనులు ఆరోజు రాత్రి తమ గుడిసెల బయట చేరి చాలాసేపు మాట్లాడు కున్నారు. అందరి ముఖాలు ఏమైతదో అన్న భయంతో ఉన్నాయి.

"మనం వేలిముద్రలేయక మంచిపని చేయలేదు" అన్నాడు పెంటయ్య. అతని ముఖం మీద విషాదం అలుముకుంది. ఏదో తప్పు చేసామన్న భావం అతనిలో కనిపిస్తోంది.

శ్రీరాములు చుట్టూ చేరిన యువకులు మాత్రం ఉత్సాహంతో ఉన్నారు.

"సరే, మీ ఇష్టం ఎట్లుంటె అట్లనే కానీయండ్రి" అన్నాడు. వాళ్ళ ఉత్సాహం చూసి వెనుకపట్టు పట్టాడు పెంటయ్య నిరుత్సాహంగా.

ఎవరి గుడిశెలోకి వాళ్ళు వెళ్ళిపోయారు. వాళ్ళు నిద్రలోకి జారుకునేసరికి అర్ధరాత్రి దాటింది. కంటిమీద కునుకు పడగానే "మంటలు, మంటలు... లేవుండ్రి, లేవుండ్రి..." అన్న అరుపులు వినిపించాయి.

పిల్లలు, ముసలివాళ్ళు అందరూ గుడిశెల బయటకు పరుగెత్తుకొచ్చి తమ ప్రాణాలను కాపాడుకున్నారు. అయితే వాళ్ళ కుండలు, చాపలు ఇతర సామగ్రి ఆ మంట ల్లోనే చిక్కుకపోయాయి. యువకులు మంటల్ని ఆర్పడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. అన్నీ కాలి బూడిదైపోయాయి.

తెల్లవారింది. గుడిశెలు కాలగా మిగిలిన, మసిబారిన మొండిగోడలు కనిపించాయి. ఆ బీభత్సమంతా చూసి హరిజనులు లబోదిబోమన్నారు. బోరున విలపించారు. పిల్లలు, పెద్దల ఏడ్పులతో ఆ ప్రదేశమంతా గందరగోళంగా మారింది.

"కావాలనే ఎవరో గుడిసెలకు నిప్పంటిచ్చిండ్రు, పోలీసులకు చెప్దాం....." అన్నాడు ఆవేశంగా శ్రీరాములు.

"కావాలని ఎవలు నిప్పు పెడ్తరు నీ పిచ్చిగాని, మనోడే రాత్రి సుట్టదాగి ఆర్పకుంట సూర్లె పెట్టి ఉంటడు. అంతే! అది కాలి మంటలు లేసి అన్ని గుడిసెలు అంటుకున్నాయి... మనం అర్ధరాతిరి దనుక మేల్కొనే ఉంటిమి గంతల్నె ఎవడొచ్చి నిప్పు పెట్టే?...." అని పెంటయ్య అన్నాడు. అందరూ గంతే అయిందన్నారు.

"చూసినవా శ్రీరాములు, వేలిముద్రలేస్తే పక్కా ఇండ్లు కటిస్తమంటే ఒద్దంటిమి, కోపంతోని ఉర్కొస్తిమి, ఇప్పుడు ఆళ్ళే గుడిశెలకు నిప్పు పెట్టిండ్రని అనేతందుకు మన

దగ్గర ఏం సాక్ష్యం లేకపాయే.... గుడిసెల ఉన్న పట్టా కాయిదాలు కూడా కాలిపాయె. యిగ గిప్పుడేం జేస్తం? మల్ల పట్టా కాయిదాలిప్పియ్యుమని ఎవరెంట తిరుగుతం. కాళ్ళు కాయలు కాసినట్టు తిరిగినా కాయిదా లిస్తరా?" అన్నాడు పెంటయ్య. ఆయన కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"అయితే నిజం తెలిసి కూడా పెంటయ్య..." మనస్సులోనే ఆశ్చర్యపోయాడు శ్రీరాములు.

లచ్చమ్మ చీర కొంగుతో కన్నీళ్ళను తుడుచుకుంటోంది. "కొడుకా చూస్తివా, ఎంత పనయిందో, ఇప్పుడు నెత్తిమీద గింత దాపు లేకుంట ఆయె. ఉరుకులాడితే ఏం ఫలితానికొచ్చింది. నిదానంగ ఆలోచన చేసి చేస్తే గింత అయ్యేది కాదేమో..." అంది.

నిన్న మొన్నటి వరకు అతని చుట్టూ చేరిన యువకులు కూడా శ్రీరాములుకి దూరంగా నిలుచున్నారు.

అక్కడి పరిస్థితి చూసాక శ్రీరాములు మనసు కలత చెందింది. తాను ఏదో మార్పు తీసుకొద్దామనుకుంటే దానికి ఉల్టాగా చాలా నష్టం జరిగింది. అతని మనస్సంతా వికలమై పోయింది. ఇక్కడే ఉంటే ఇంకేదైనా జరగవచ్చని తిరిగి పట్నం వెళ్ళడానికి నిశ్చయించు కున్నాడు.

"ఎన్నడయినా వీళ్ళను ఎదిరించి నిలబడే బాటలో నడపాలె" అనే నిశ్చయంతో శ్రీరాములు పట్నం వెళ్ళిపోయాడు.

అదేరోజు పదిగంటల వరకు ఆనందరావు తన మనుషులతో అక్కడికి చేరు కున్నాడు. అన్నం, పప్పు, కూరలతో నిండి ఉన్న గిన్నెలతో వచ్చాడు. అన్నం లేక ఏడుస్తున్న పిల్లల్ని సముదాయించ లేకుండా ఉన్న ఆడవాళ్ళు, ఆకలితో వున్న ముసలివాళ్ళు బిలబిలమంటూ గిన్నెల దగ్గరికి చేరుకున్నారు.

మిగతావాళ్ళు కూడా కాలి బూడిదయిన గుడిసెలు ఏడిస్తే రావని ఒక నిర్ణయాని కొచ్చి ఆకలికి తట్టుకోలేక అక్కడికి చేరుకున్నారు.

అందరిని వరుసగా కూర్చోబెట్టి ఆనందరావు మనుషులు వడ్డించారు. పెంటయ్యను లచ్చవ్వను, ఇతరులను ఆనందరావు ఓదార్చాడు. తరువాత అక్కడివాళ్ళంతా కడుపు నిండా తిన్నారు. ఘుమఘుమలాడే పప్పుచారుతో అన్నం ఎంతో బాగుంది. వాళ్ళంతా రెండు ముద్దలు ఎక్కువే తిన్నారు. అలాంటి భోజనం తాము తినక చాలా రోజులయిందని వాళ్ళు సంతృప్తి పడ్డారు.

"ఆపతిల ఉన్నప్పుడు వచ్చి ఆదుకున్నోడే మనిషి" అని అందరూ ఆనందరావు గొప్ప గుణాన్ని ప్రశంసించారు.

ఆనందరావు సాయంత్రం వరకు అక్కడే ఉండి హరిజన పెద్దలను పిలిచి

"మీకందరికి జరిగిన అన్యాయానికి బాధపడుతున్నాను. పక్కా ఇండ్లు కట్టించమని సర్కారుకు మళ్ళ చెప్తాను. మీకు ఆ ఇండ్లు వచ్చే వరకు ఊర్కోను. అందరికి ఇండ్లుండాలె. అంతవరకు తడికెలు, బొంగులు తెచ్చుకునేందుకు తలా వెయ్యి ఇస్తను తీసుకోండ్రి. అయితే నిన్నటి కాయితాల మీద సంతకాలు పెట్టుండ్రి" అని కాగితాలను వాళ్ళ ముందు పెట్టాడు.

ఆ సమయంలో ఎంత యిచ్చినా నయమే అనుకుని ఒక్కొక్కరు లేచి కాగితాలపై వేలిముద్రలు వేశారు.

నిన్న రెండువేల రూపాయలు ఇస్తానన్నా జరగని పని ఈరోజు వెయ్యికే అయిపోయి నందుకు ఆనందరావు ఆనందానికి అవధుల్లేవు.

- ఆదివారం ఆంధ్రప్రభ, 8 అక్టోబర్ 2000